


"ఫర్ ద గుడ్ హెల్త్ ఆఫ్ మిస్టర్ ప్రవీణ్!"

మూడు గ్లాసులు, ఒక సాఫ్ట్ డ్రింక్ సీసా స్పృశించుకున్నాయి.

"ఛీర్స్!" ఒకేసారిగా అన్నారు వినీల్, కిరీట్, ప్రవీణ్, జగదీష్.

ఆత్రంగా ఓ సిప్ వేసుకుని సిగరెట్ వెలిగించాడు వినీల్.

"సో... ఈ రోజు మన కథకుడు జగదీష్ కదూ?" అడిగాడు కిరీటి.

"మిస్టర్ జగదీష్! యు కెన్ ప్రొసీడ్." చిప్స్ నోట్లో వేసుకుంటూ అన్నాడు ప్రవీణ్.

"మన అగ్రిమెంట్ ప్రకారం నే నో కథ చెప్పాలి" అన్నాడు జగదీష్.

"కాని ఈ రోజు మీ కో యథార్థ గాథ చెబుతాను. ఒ.కే?" చేతిలోని సాఫ్ట్ డ్రింక్ బాటిల్‌ని అటూ ఇటూ తిప్పుతూ మిత్రులు ముగ్గురివైపు చూశాడు.

• "అగ్రీడ్." ముక్త కంఠంతో అన్నారు మిత్ర బృందం.

** ** **

"అది 1970వ సంవత్సరం. మా వీధిలో సాంబశివరావనే ఓ టీచ రుండేవాడు. పరమ సాత్వికు డతను. శత్రువుని సైతం క్షమించగలిగేంత సహనశీలి. తన లోకమె తను అన్న ట్లుండేవాడు.

"శివరావు భార్య చంద్రిక లావణ్యవతి. పైగా చదువుకున్నది కూడా. ఇద్దరు పిల్లల తల్లయినా పెళ్ళికాని అమ్మాయిలా మిల మిలా మెరిసి పోయేదంటే ఆమె అందచందా లెలాంటివో ఇట్టే ఊహించవచ్చు మీరు.

చంద్రిక తల్లిదండ్రులు కాస్త ఉన్నవాళ్ళు. తండ్రి తాసీల్దారుగా చేసి సడన్‌గా పోతే మేనమామ శివరావుతో ఆమె పెళ్ళి జరిగిపోయింది. శివరావుకి సెకండరీ గ్రేడ్ టీచర్‌గా వచ్చే జీతం తప్పించి వేరే ఆదాయ మేదీ ఉండేది కాదు.

'పెళ్ళయిన కొత్తలో అంతా సవ్యంగానే సాగింది. పిల్లలు పుట్టడంతో ఆమెకు ఇక్కట్లు మొదలయ్యాయి. భర్తతో కలిసి షైర్లు తిరగాలనీ, సెలవుల్లో సినిమాలు చూడాలనీ ఆమె ఉవ్విళ్ళూరేది. పిల్లలకు ఏవో రోగాలు, రొష్టులతోనే సరిపోయేది. ఇంకెక్కడి షైర్లు? అనతి కాలంలోనే ఆమెలో అసంతృప్తి పొడసూపింది.

"తన అసంతృప్తిని వెళ్ళగక్కడానికి చేరువలో ఎవరూ లేకపోవడం వల్ల నైతేనేమి, భర్త మెతకదనం వల్ల నైతేనేమి, చీటికీ, మాటికీ ఆమె భర్త శివరావు పైన అకారణంగా చిరాకు ప్రదర్శించేది. పెళ్ళి కాక ముందు హాయిగా, స్వతంత్రంగా ఫ్రెండ్స్‌తో గడిపిన రోజులను ఒంటరిగా ఉన్నపుడు తలచుకుని తనలో తనే తెగ బాధపడేది. ఏడుస్తున్న పిల్లలను సముదాయించడం మాని మరి నాలుగు వడ్డించేది. శివరావు స్కూలు నుంచి రాగానే పిల్లలిద్దరినీ అతని ముందుకు తోసి పక్క గదిలోనికి పోయి ముసుగు తన్నేసేది.

"పల్లె చిన్నదే అయినా అయిదారుగురు డాక్టర్లున్నారు మా ఊళ్ళో. పల్లె కాబట్టి కబురంపితే చాలు ఇంటికి వచ్చి మరీ ట్రీట్ చేస్తారు అక్కడి డాక్టర్లు. మా ఊళ్ళో కిశోర్ అనే ఓ కుర్ర డాక్టరుండే వాడు. స్మార్ట్‌గా టక్ చేసేవాడు. ట్రిమ్‌గా మేకప్ చేసుకునేవాడు. పొద్దుటి నుంచి సాయంత్రం వరకూ ఒకేలా చెక్కుచెదరని గెటప్ - అదీ అతని గ్లామర్. సెంటు పరిమళాలతో ఆడవాళ్ళని ఇట్టే ఆకర్షించేవాడు కిశోర్."

సాఫ్ట్ డ్రింక్ చప్పరించడాని కన్నట్లుగా కాసేపాగాడు జగదీష్.

"ఏవిటా కుర్ర డాక్టరు మన చంద్రికను కిస్ గాని చేసేశాడా?" గ్లాసులోనికి విస్కీ వంపుకుంటూ ఆత్రంగా అడిగాడు వినీల్.

"వినబోతూ క్లైమాక్స్ అడక్కు. వస్తున్నాగా!"

డయాగ్నైజ్ చేయాల్సిన డాక్టర్, శరీరంలోని ఏ భాగాన్నయినా టెస్ట్ చేసే నిమిత్తం తాకొచ్చు. వృత్తి రీత్యా అది అతని ప్రివిలేజ్ ఆ ప్రివిలేజ్‌ని తెలివిగా తన స్వార్థం కోసం వాడుకొనేవాడు కిశోర్. అతని దృష్టిలో పడ్డ అమ్మాయిని టాక్ట్‌ఫుల్‌గా లోబరుచుకునేవాడు. టెస్ట్ మిషతో సున్నితమయిన భాగాలని సుతారంగా స్పృశించి గిలిగింతలు పెట్టేవాడు.

"డాక్టర్ కిశోర్‌కి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారంటే అతన్ని చూసిన వారెవరూ నమ్మరు. అదీ అతని స్టైల్. అచిర కాలంలోనే కిశోర్ చంద్రికను తన దొంగచాటు సరసాల్లో ముంచెత్తాడు.

"శివరావు స్కూలికి వెళ్ళే సమయాల్లో వాళ్ళింటికి వెళ్తుండేవాడు కిశోర్. చంద్రికను ఊపిరాడనంత గాఢంగా ముద్దుల్లో ముంచెత్తేవాడు. తను చేస్తున్నది తప్పని ఆమెకు తెలియక కాదు. కాని ఎప్పుడూ మూడీగా, పాసివ్‌గా, డల్‌గా ఉండే భర్త శివరావు పట్ల ఆమె కున్న అసంతృప్తి, హమేషా చలాకీగా ఉండే డాక్టర్ చిలిపి పనులతో మరింత పెరిగి, తను చేస్తున్నది సరైనదే నని తనకు తాను సర్ది చెప్పుకునేది. రోడ్డు పక్క ఇల్లు. పైగా సందడిగా ఎప్పుడూ ఎవరో తిరిగే వీధి కావడంతో ముద్దులు దాటి ముందుకు పోలేదు వాళ్ళిద్దరి రొమాన్సూ."

కాస్త రిలీఫ్ కోసమన్నట్లుగా ఆగాడు జగదీష్.

"రియల్లీ ఇంట్రెస్టింగ్ ఈవెంట్స్. తరువాత ఏమయింది భాయ్?" ఫ్రైడ్ చికెన్ నములుతూ అడిగాడు ప్రవీణ్.

"ఏముంది? ఓ రోజు ఎర్లీ అవర్స్‌లో చంద్రిక కిశోర్‌తో లేచిపోయింది." తాపీగా అన్నాడు జగదీష్.

"అరెరె!" అదిరిపడ్డాడు కిరీటి.

"ఆమెను గుడివాడ తీసుకుపోయి లాడ్జిలో ఓ, పది రోజులు మజా చేశాడు. పిటియబుల్ థింగ్ ఏంటంటే ఆమెను పెళ్ళి చేసుకుంటానని చెప్పి మాయ చేసి తీసుకెళ్ళి లాడ్జిలో వదిలేసి చక్కా వచ్చేశాడు కిశోర్. తరువాత చేతి గాజులమ్ముకుని మా ఊరు చేరుకుంది చంద్రిక. అప్పటికే ఊరంతా ఈ వార్త గుప్పుమంది. ఈ సంఘటన శివరావు మనసు మీద బలమైన గాయమే చేసిందని చెప్పాలి. అయితే తిరిగొచ్చిన శ్రీమతిని శివరావు, ఏం చేసి ఉంటాడో కాస్త ఊహించి చెప్పండి చూద్దాం?" అంటూ ఆగాడు జగదీష్.

"సరికి పోగులు పెట్టుంటాడు." ఏక కంఠంతో అన్నారంతా.

"అలా ఏం చేయలేదు. ఆమెను మంచి మనసుతో క్షమించి ఇంటికి ఆహ్వానించాడు. ఆమె రానన లేదు. ఆడదానికి భద్రత కావాలిగా మరి! భర్త మొహం వాచేలా తిట్టినా, చివరికి చెప్పు తీసుకుని ఆ దవడా, ఈ దవడా వాయగొట్టినా ఆమె మనసు కాస్తయినా కుదుట పడేదేమో! అందుకు భిన్నంగా అస లేమీ జరగ లేదన్నట్లుగా మామూలుగా ఉండసాగాడు శివరావు. తుఫాను వెలిసిన తరువాత ప్రశాంతత లాంటి స్థితి అది! ఆ భయంకర మానసిక క్షోభను ఆమె తట్టుకోలేక పోయింది. వారం తిరక్క ముందే పెరట్లోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది చంద్రిక."

"ఆఁ?" ఆశ్చర్యంగా అడిగారు మిత్రులు ముగ్గురూ.

"అంతే కాదు. మరో విచిత్రమయిన విషయమేంటంటే, ఆ టీచర్ ఎవరో కాదు.... నేనే!"

"వ్వాట్?" నోళ్ళు వెళ్ళబెడుతూ అన్నారంతా.

చప్పట్లు కొట్టాడు శివరావు ఉరఫ్ జగదీష్.

"దయుంచి మీ రంతా కాస్త నోళ్ళు మూస్తారా? లేకుంటే దోమలు దూరే ప్రమాద ముంది" అంటూ చిరు మందహాసం చేసి "చంద్రిక పట్ల నాలో ఏ మూలో ఇంకా సాఫ్ట్ కార్నర్ ఉంది. అందుకే పెళ్ళి చేసుకోలేదు మళ్ళీ. ఇక చేసుకోను కూడా!" అంటూ ముగించాడు జగదీష్.

మరో పది నిమిషాల వరకూ విస్మయం నుంచి తేరుకోలేక పోయారు మిత్ర బృందం. •

★